సుందరీకరణ కాదు..
వేళ్లూనుకున్న నిర్లక్ష్యం



నంద్యాల పట్టణం బొమ్మలసత్రం నుంచి కర్నూలుకు వెళ్లే దారిలో కుందూనదిపై ఉన్న పాత వంతెన ఇది. దశాబ్దాల కిందట నిర్మించిన ఈ వంతెన రాతి దిమ్మెలకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. ఏళ్లు గడుస్తున్నా వాటిని తొలగించకపోవడంతో వేళ్లూనుకున్నాయి. వీటివల్ల వంతెన గోడలకు బీటలు వారుతున్నాయి. ఈ వంతెనపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దూరం నుంచి చూసిన వారు పట్టణ సుందరీకరణలో భాగంగా అలంకరణ మొక్కలు పెంచారేమోనని భ్రమపడతారు. వాస్తవం తెలిశాక వంతెనకు ముప్పు పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే వీటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం



వరద గేట్ల ద్వారా దిగువకు పరుగులు తీస్తున్న కృష్ణాజలాలు

జల పరవళ్లు

ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 1,68,863 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీంతో సోమవారం జలాశయం ఐదు వరద గేట్లను పది అడుగులమేర పైకెత్తి 1,38,770 క్యూసెక్కులు, కుడి, ఎడమ గట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 66,203 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం జలాశయం నీటిమట్టం 884.30 అడుగులు, నీటి నిల్వ 211.4759 టీఎంసీలుగా నమోదైంది.
– న్యూస్‌టుడే, సున్నిపెంట సర్కిల్

టెట్‌కు 35 మంది గైర్హాజరు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : ఆర్జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 35 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో2 సుబ్రమణ్యం తెలిపారు. 160 మంది అభ్యర్థులకు గాను 125 మంది పరీక్షకు హాజరైనట్లు చెప్పారు.


అక్రమ అంతస్తుల్లో
అధికారుల దండా

- 17 మందిపై చర్యలకు రంగం సిద్ధం
- బాధ్యుల్లో ఇద్దరు పుర కమిషనర్లు

– ఈనాడు, నంద్యాల, న్యూస్‌టుడే, నంద్యాల పురపాలకం

నంద్యాల పట్టణంలో అక్రమ పునాదులకు అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.. ఇందుకు సంబంధించి 17 మందిని బాధ్యులుగా గుర్తించి వారిపై అభియోగాలను (ఆర్టికల్స్ ఆఫ్ ఛార్జెస్) నమోదు చేసింది. 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఆలోపు వివరణ ఇవ్వకపోతే అందుబాటులో ఉన్న సాక్ష్యాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఆమేరకు ప్రతి ఒక్కరిపై పేరుపేరున ప్రభుత్వం సోమవారం జీవోలు విడుదల చేయడం సంచలనం సృష్టించింది.

అక్రమ నిర్మాణాల వెనుక పుర కార్యాలయంలో వైకాపా హయాంలో ఇద్దరు వ్యక్తులు కథ నడిపించారు. పలు అక్రమాలను నిర్ధారించి ప్రభుత్వానికి నివేదిక అందించారు. అక్రమాలకు అప్పటి వైకాపా పెద్దల అండదండలు ఉండటంతో చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం 'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి రావడంతో లోకాయుక్త ఫిర్యాదుమేరకే రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది.



అధికారుల్లో కలకలం

నంద్యాల పట్టణంలో భవన నిర్మాణాలకు సంబంధించి జరిగిన అక్రమాలకు బాధ్యులుగా 17 మందిని గుర్తించారు. వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. పూర్వ మున్సిపల్ కమిషనర్లు జి.రమణారెడ్డి, జి.పుల్లారెడ్డి, సహాయ సిటీ ప్లానర్ వీఎస్ఎం. నరసింహమూర్తి, పూర్వ సహాయ సిటీప్లానర్ వి.రామకృష్ణుడు, ఇన్‌ఛార్జి సహాయ సిటీ ప్లానర్ ఎస్.రంగస్వామి, పట్టణ ప్రణాళిక విభాగం పూర్వ సూపర్‌వైజర్లు డి.రాణెమ్మ, ఎ.బాలమద్దయ్య, ప్రస్తుత సూపర్‌వైజర్ శివుడు నాయక్, పూర్వ టీపీబీవో రిజ్వానా, సచివాలయ డబ్ల్యూపీఆర్ఎస్‌లు వి.సిద్ధార్థ్, ఎ.శేఖర్, ఎస్.సాయిరంగ మనోజ్, జి.భరత్‌కుమార్, పి.రామలక్ష్మి, వి.కల్యాణి, బి.సంధ్యారాణి, కె.మధుసూదన్‌రెడ్డిలపై విచారణ చేయాలని నిర్ణయించింది.

నివేదికలు తొక్కిపెట్టారు

నంద్యాల పట్టణంలో బహుళ అంతస్తుల నిర్మాణాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. అదే స్థాయిలో అక్రమాలు సాగుతున్నాయి. కొన్నింటికి ఇంతవరకు అనుమతులే లేవు. మరి కొన్నింటికి అనుమతులు తీసుకున్న దానికి రెట్టింపు స్థాయిలో నిర్మాణాలు చేస్తున్నారని న్యాయవాది ఎం.రామకృష్ణ మూడేళ్ల కిందట పుర అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు పట్టించుకోకపోవడంతో ఏడాది కిందట లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. అంతకుముందు రాష్ట్ర విజిలెన్స్ అధికారులకూ ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ అధికారులూ పట్టణంలో విస్తృతంగా తనిఖీలు చేశారు.

ఇష్టారాజ్యంగా నిర్మాణాలు

- నివాసగృహాల కింద అనుమతులు తీసుకుని 27 చోట్ల దుకాణ సముదాయాలు నిర్మించారు. వీటి వివరాలు పరిశీలించారు. టెక్కె, సలీంనగర్, చాంద్‌బాడా, ఎస్బీఐ కాలనీ, ఎన్జీవో కాలనీ, పశువుల ఆసుపత్రి సమీపంలో, ఆర్ఎస్.రోడ్డు, ఎన్జీవో కాలనీలో ఇలాంటి నిర్మాణాలు చేపట్టారు. ఇవన్నీ అక్రమమే అయినా అధికారులు నోటీసులు ఇవ్వకపోవడం గమనార్హం.
- పట్టణంలో 57 ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకుని వాణిజ్య సముదాయాలు నిర్మించారు. పద్మావతి నగర్‌లో రెండుచోట్ల ఐదు అంతస్తులతో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్లకు కనీస స్థాయిలో అనుమతులు లేవు. ఇదే ప్రాంతంలో ఓ అపార్ట్‌మెంట్ యజమాని ఐదు సెంట్ల పుర స్థలాన్ని ఆక్రమించి కడుతున్నా అధికారులు పట్టించుకోలేదు.

అక్రమాలకు అండదండలు

- రెండు అంతస్తుల వరకు నంద్యాల పురపాలక సంఘం అనుమతులు ఇస్తుండగా.. ఆపై అంతస్తులకు ఉన్నత స్థాయిలో అనుమతులు తీసుకోవాల్సి ఉంది. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది చేతులు తడిపి అనుమతులు ఒకలాగా తెచ్చుకుని.. అందుకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు.
- నిర్మాణాలకు తుది అనుమతులిచ్చే ముందు పుర అధికారులు ఆ భవన నిర్మాణాన్ని పరిశీలించి లోపాలు, తప్పిదాలు (షార్ట్‌ఫాల్స్) గుర్తించాలి. ఇక్కడే పురపాలక సంస్థ ఉద్యోగులు పెద్దఎత్తున అవినీతిని తెరలేపుతున్నారు. పలు భవనాలకు షార్ట్‌ఫాల్స్ రాస్తున్నారు గానీ భవన యజమానులు ఆయా తప్పిదాలు, లోపాలు సవరించుకోకుండా యథేచ్ఛగా నిర్మాణాలు సాగిస్తున్నా పట్టించుకోవడం లేదు. అందినంత దండుకుని మిన్నకుండిపోతున్నారు. ఫలితంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి రూ.కోట్లలో గండిపడుతోంది.
- వార్డుస్థాయిలో సచివాలయాల్లో ఉండే 'వార్డు ప్లానింగ్, రెగ్యులేటరీ కార్యదర్శి'(డబ్ల్యు.పి.ఆర్.ఎస్.) కళ్లముందే నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నా పట్టించుకోలేదు. 14 శాతం ఓపెన్ స్పేస్ రుసుములు వసూలు చేయడంలేదు.

ఆటకు శ్రీకారం



నంద్యాల విద్య, న్యూస్‌టుడే: సర్కారు బడుల్లో చదువుతున్న భావితరానికి పదును పెట్టేందుకు కేంద్రం ముందుకొచ్చింది. ఇందులో భాగంగా 'పీఎం-శ్రీ' పథకానికి శ్రీకారం చుట్టింది. ఎంపిక చేసిన బడుల్లో ప్రయోగశాలలు ఆట స్థలాలు అభివృద్ధి చేయనున్నారు. ఎంపిక చేసిన బడుల్లో ఒక్కో పాఠశాలకు రూ.5 లక్షలు వెచ్చించారు. ఈ నిధులతో క్రికెట్ మైదానం, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, లాంగ్‌జంప్, కబడ్డీ, షటిల్, ఫుట్‌బాల్, రన్నింగ్ గ్రౌండ్ పిచ్‌ను అభివృద్ధి చేయనున్నారు. కర్నూలు జిల్లాలో 37 పాఠశాలల్లో ఆట స్థలాల అభివృద్ధికి ఒక్కో బడికి రూ.5 లక్షలు వెచ్చిస్తారు. ఇందులో ఒక్కో బడికి రూ.2 లక్షలు చొప్పున రూ.60 లక్షలు మంజూరయ్యాయి. నంద్యాల జిల్లాలో 37 బడుల్లో క్రీడాభివృద్ధికి ఒక్కో బడికి రూ.లక్ష చొప్పున రూ.37 లక్షలు మంజూరయ్యాయి.

ఇక్కడ ప్రయోగశాలలు

○ నంద్యాల జిల్లాలో దొర్నిపాడు, ఇల్లూరు కొత్త పేట, కొనిదెల, కొత్తపల్లి, ఎన్.కొతపల్లి, పేరుసోమలలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తున్నారు.

ముఖ హాజరు
ముప్పుతిప్పలు




ముఖ ఆధారిత హాజరు తీసుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్త

గత ప్రభుత్వం నిర్లక్ష్యం..శాపంలా వెంటాడుతోంది. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన ఫోన్లు పనిచేయకపోవడంతో పౌష్టికాహారం పంపిణీలో వారు ఎన్నో ఇబ్బందులుపడుతున్నారు. గత ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నాణ్యత లేని చరవాణులు అందించింది. 2022 సెప్టెంబరులో 3,549 అంగన్‌వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలకు ఇచ్చిన చాలా చరవాణులు పని చేయడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని సరకులు పక్కదారి పట్టకూడదని గర్భిణులు, బాలింతలకు ముఖ ఆధారిత హాజరును అమలు చేస్తున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకూ కూడా ముఖఆధారిత హాజరు ద్వారా పౌష్టికాహారం ఇవ్వాలని ఆదేశాలు రావడంతో ఇప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తల్లో ఆందోళన ఎక్కువవుతోంది.
– న్యూస్‌టుడే, ప్యాపిలి, డోన్‌పట్టణం

ఓటీపీకి అవస్థలు

పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వడానికి ముఖ ఆధారిత హాజరు, ఈకేవైసీ, మొబైల్ వెరిఫికేషన్ చేయాలి. పిల్లల పేరిట అనుసంధానమైన మొబైల్ నంబర్లలో వివరాలు నమోదు చేస్తే ఓటీపీలు వస్తాయని, వాటిని చెబితే ఏదైనా జరుగుతుందేమోనని కొంతమంది తల్లిదండ్రులు చెప్పకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కార్యకర్తలు చెబుతున్నారు. ఒక ఇంట్లో ముగ్గురు చిన్నారులుంటే ఇద్దరికే తల్లి చరవాణి నంబరు పనిచేస్తోందంటున్నారు. ప్రతిసారి ఓటీపీకి సిగ్నల్స్ అందక అవస్థలు పడుతున్నామని, సాంకేతిక సమస్యలు వేధిస్తున్నాయని చెబుతున్నారు. పోషణ ట్రాకర్ యాప్‌లో గర్భిణులు, బాలింతలు, టీహెచ్ఆర్ పిల్లలకు చరవాణుల్లో రిజిస్ట్రేషన్ చేయాలని కార్యకర్తలకు చెప్పామని నంద్యాల ఐసీడీఎస్ తాత్కాలిక ప్రాజెక్టు అధికారిణి లీలావతి తెలిపారు. వందశాతం రిజిస్ట్రేషన్ జరిగేలా చూడాలని చెప్పామని, గతంలో ఇచ్చిన చరవాణులు పనిచేయకపోయినా, సాంకేతిక సమస్య ఉన్నా పరిష్కరిస్తామన్నారు.




పౌష్టికాహారానికి ఇక్కట్లు

- గర్భిణులు, బాలింతలకు: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ఒక్కొక్కరికి నెలకు 3 కిలోల బియ్యం, కిలో కంది బేడలు, 500 గ్రా వంట నూనె, 5 లీటర్ల పాలు, 25 గుడ్లు, బాల సంజీవని కిట్ ద్వారా రెండు కిలోల రాగి పిండి, కిలో అటుకులు, పావుకిలో ఖర్జూరాలు, పావుకిలో బెల్లం, పావు కిలో చిక్కీలు ఇస్తారు.
- టీహెచ్ఆర్ పిల్లలకు: 7 నెలల నుంచి 3 ఏళ్ల లోపు పిల్లలకు రెండున్నర కిలోల బాలామృతం ప్యాకెట్, రెండున్నర లీటర్ల పాలు, 25 గుడ్లు నెలలో రెండుసార్లు ఇస్తారు. వాటిని మొదటి, మూడో శుక్రవారం పంపిణీ చేస్తారు.

అలగనూరుకు అడుగులు

- రూ.34 కోట్లతో మరమ్మతులు
- 250 మీటర్ల పొడవున కట్ట నిర్మాణం

గత సర్కారు నిర్వాకంతో 'నీరు'గారిన అలగనూరు జలాశయానికి మరమ్మతులు చేసేందుకు 'కూటమి' ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మూడేళ్లుగా నీరు నిల్వ చేయకపోవడంతో ఒట్టిపోయిన అలగనూరు జలాశయాన్ని ప్రాధాన్యతా జాబితాలో చేర్చింది. మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని కేసీ కాల్వ అధికారులను ఆదేశించింది. కట్టకుంగిన ప్రాంతంలో పనులు చేసేందుకు రూ.34 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. 250 మీటర్ల పొడవునా కొత్త బండ్ నిర్మాణం చేయాల్సి ఉంటుందని నివేదించారు. కుంగిన ప్రాంతంలో గతంలో వాగు ఉండేది.. అక్కడ పటిష్ఠంగా పనులు చేయకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు గుర్తించారు. వేగంగా పూర్తి చేస్తే కేసీ కాల్వ పరిధిలో వెయ్యి ఎకరాల ఆయకట్టును స్థిరీకరించొచ్చు.. పలు గ్రామాలకు మంచినీరు అందించొచ్చు.. రెండు వందల మత్స్యకార కుటుంబాలు బతుకుబండిని లాగిస్తాయి.
– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, పాణ్యం





అలగనూరు జలాశయం పరిస్థితి

మూడేళ్లుగా చుక్కనీరు లేదు

○ తలముడిపి మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో చేపలు, రొయ్యలు పెంచేవారు. వాటి విక్రయం ద్వారా ఏడాదికి రూ.6 కోట్ల ఆదాయం వచ్చేది. అలగనూరు, తలముడిపి, రోళ్లపాడు, కొర్రపోలూరుకు చెందిన సుమారు 200 మత్స్యకార కుటుంబాలు జలాశయంపై ఆధారపడి జీవనం సాగించేవారు. జలాశయంలో 2022 నుంచి నీరు లేక లేకపోవడంతో వీరంతా ఉపాధి కోల్పోయారు.

○ జలాశయంలో నిల్వ చేసిన నీటిని సాగు, తాగునీటికి వినియోగించేవారు. కేసీ కాల్వ ద్వారా వైఎస్సార్ జిల్లాకూ తరలించేవారు. 450 క్యూసెక్కుల నీటిని కుందూకు విడుదల చేసేవారు. జలాశయంలో నీటిని నిల్వ చేయడంతో గడివేముల, మిడుతూరు మండలాల్లో భూగర్భజలాలు వృద్ధి చెందేవి.. నీటిని విడుదల చేస్తే పులిమద్ది, రాయమాల్పురం, పోలూరు, మునగాల, తిరుపాడు, కొరటమద్ది గ్రామాలకు సాగునీరు అందేది.

నిర్మించిన తెదేపా

○ కర్నూలు-కడప (కేసీ) కాల్వ కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1.84 లక్షలు, వైఎస్సార్ జిల్లా పరిధిలో 90 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. తుంగభద్ర జలాశయంలో వర్షాకాలంలో నీరు సమృద్ధిగా ఉంటే ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. వేసవిలో పంటలకు నీటి కష్టం ఎదురయ్యేది. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేసీ కాల్వ ఆధునికీకరణ పనుల్లో భాగంగా అలగనూరు జలాశయానికి రూపకల్పన చేశారు.

○ వర్షాకాలంలో నీటి లభ్యత ఉన్నప్పుడు ఇందులో 2.965 టీఎంసీల నీరు నిల్వ చేసుకుని.. వేసవిలో ఆయకట్టుకు అందించాలన్నది లక్ష్యం. మిడుతూరు మండలం అలగనూరు గ్రామ సమీపంలో తెదేపా హయాంలో దీన్ని నిర్మించారు. గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో 3,585 ఎకరాలు సేకరించి రూ. 59.7 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. 7.50 కి.మీ. మట్టికట్ట నిర్మించారు.

నిర్వీర్యం చేసిన వైకాపా

○ 2018-19 మధ్యకాలంలో కట్టకుంగిపోవడంతో అప్పటి తెదేపా ప్రభుత్వం అప్రమత్తమై రూ.3.50 కోట్లు మంజూరు చేసింది. అంతలోనే ప్రభుత్వం మారింది.. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా త్వరగా స్పందించలేదు. 2021-22లో టెండర్లు పిలిచి పనులు అప్పగించింది.

○ మరమ్మతుల పేరుతో 20 మీటర్ల కట్ట తొలగించారు. గుత్తేదారు పనులు చేపట్టినా బిల్లులు అందక మధ్యలో వదిలేశారు. పనుల్లో జాప్యం కావడంతో మట్టి కట్ట తొలగించిన ప్రాంతం నుంచి సుమారు 500 మీటర్ల వరకు మళ్లీ కట్ట కుంగిపోయింది. మొత్తం మరమ్మతులకు రూ. 24 కోట్లు కావాలంటూ అధికారులు మళ్లీ ప్రతిపాదనలు పంపారు. జగన్ సర్కారు స్పందించలేదు.

వెండి రథంపై ఆదిదంపతుల విహారం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లకు సోమవారం వెండి రథోత్సవం వైభవంగా జరిగింది.



వెండి రథోత్సవం నిర్వహిస్తున్న ఇన్‌ఛార్జి ఈవో, సిబ్బంది

సాయంత్రం వెండి రథాన్ని ముస్తాబు చేసి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, మంగళ హారతులు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్లను రథంపై ఊరేగించారు. ఇన్‌ఛార్జి ఈవో ఇ.చంద్రశేఖర్ రెడ్డి దంపతులు, పర్యవేక్షకులు అయ్యన్న, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సేవలు మరువలేనివి

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు మరువలేనివని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. నంద్యాలలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అదిరాజ్ సింగ్‌రాణా ఆధ్వర్యంలో సోమవారం అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కలెక్టర్, ఎస్పీ పోలీసు దళాల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విధి నిర్వహణలో అసువులుబాసిన వారికి నివాళి అర్పించారు. ఏఎస్పీ యుగంధర్‌బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, పరేడ్ కమాండ్ నాగభూషణం, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులతో కలెక్టర్, ఎస్పీ

ఆగిన బతుకు చక్రం

మంచానికే పరిమితం.. పింఛనుకు దూరం



చల్లా వెంకటేశ్వర్లు

కారు డ్రైవరుగా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉన్న వ్యక్తిని.. పక్షవాతం కదల్లేని స్థితికి చేర్చింది. ఏడాదిగా పూర్తిస్థాయిలో మంచానికే పరిమితం అయ్యారు. ఒకరు సాయంగా ఉంటేగాని పక్కకు కదల్లేని పరిస్థితి. శరీరంలో సగభాగం చచ్చుబడిపోగా.. మిగతా సగం భరించలేని నొప్పులు. నెలనెలా వైద్యం, మందుల ఖర్చులకు ఎక్కువ మొత్తం ఖర్చవుతోంది. పింఛను వస్తే ఆర్థిక కష్టాలు కొంత తీరుతాయని ఆశించారు. వైద్యుల తీరుతో ప్రభుత్వ సాయం దూరమవుతోందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

గడివేముల మండలం పెసరవాయికు చెందిన చల్లా వెంకటేశ్వర్లుకు 45 ఏళ్లు. గత 25 ఏళ్లుగా కారు డ్రైవరుగా పనిచేస్తూ జీవనం సాగించే వారు. ఏడాది కిందట రెండు కాళ్లు, కుడి చెయ్యి చచ్చుబడ్డాయి. కుటుంబ సభ్యులు నాటు వైద్యుడి వద్ద పసరు తాగించగా కొంత నయమైంది. మూడు నెలల తర్వాత మళ్లీ సమస్య తిరగబెట్టింది. ఈసారి రెండు కాళ్లు పూర్తిగా, కుడి చెయ్యి సగం చచ్చుబడ్డాయి. కుటుంబ సభ్యులు వెంటనే కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి పక్షవాతంగా తేల్చారు. వెన్నెముక దెబ్బతినడంతో శరీరం చచ్చుబడిందని చెప్పారు. శస్త్రచికిత్స చేసినా ఉపయోగం లేదన్నా కొంతకాలం మందులు వాడితే ఫలితం ఉంటుందని చెప్పారు. దీంతో ఇంటిపట్టునే ఉంటూ మందులు వేసుకుంటున్నారు. ఇంట్లో సంపాదించే వ్యక్తి మంచానికి పరిమితం కావడంతో కుటుంబ నిర్వహణ కష్టమైంది. భార్య ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయారు. దీంతో ఈయన వ్యవసాయ కూలీలైన తల్లిదండ్రులు వెంకటలక్ష్మమ్మ, తిరుపతయ్య చెంతన చేరారు. కూలి పనులు మానేసి వారు కుమారుడి బాగోగులు చూసుకుంటున్నారు. తండ్రికి వచ్చే వృద్ధాప్య పింఛనుతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. వెంకటేశ్వర్లు ఎడమ చేతిని మాత్రమే కదపగలరు. పక్కకు తిరగాలన్నా ఒకరి సాయం ఉండాల్సిందే. ఈ స్థితిలో అన్నం కూడా తల్లే తినిపిస్తున్నారు. కుమారుడికి అన్ని సపర్యలు చేస్తున్న వృద్ధ తల్లిదండ్రులకు వైద్య ఖర్చులు భారంగా మారాయి. దివ్యాంగుల పింఛను వస్తే ఆర్థిక సమస్యలు కొంత వరకు తగ్గుతాయన్న ఆశతో దరఖాస్తు చేశారు. వైకల్య ధ్రువీకరణ పత్రం కోసం అధికారులు చెబితే 8 నెలల కిందట ఆళ్లగడ్డ సదరం శిబిరానికి వెళ్లారు.

ధ్రువీకరణకు ప్రదక్షిణలు

అక్కడి వైద్యులు కర్నూలుకు వెళ్లమని చెప్పారు. దీంతో కర్నూలు సర్వజన ఆసుపత్రికి వెళ్లారు. మీది నంద్యాల జిల్లా కాబట్టి నంద్యాల ఆసుపత్రికి వెళ్లమని వారు సలహా ఇచ్చారు. ఇలా తిరగడంలోనే మూడు నెలలు గడిచిపోయాయి. ఈలోపు సార్వత్రిక ఎన్నికలు రావడంతో మరో మూడు నెలల సమయం గడిచింది. వైకల్య ధ్రువీకరణ పత్రం ఉంటేనే పింఛను వస్తుంది. దీంతో నెలల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని వెంకటేశ్వర్లు వాపోతున్నారు. తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

మద్యం దుకాణం ఏర్పాటును వ్యతిరేకిస్తూ ధర్నా



మండల సమాఖ్య కార్యాలయం ఎదుట రహదారిపై ధర్నా చేస్తున్న పొదుపు మహిళలు

గడివేముల, న్యూస్‌టుడే : గడివేములలోని పొదుపు లక్ష్మి మండల సమాఖ్య కార్యాలయం ఎదుట మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం పొదుపు మహిళలు ధర్నాకు దిగారు. తహసీల్దారు వెంకటరమణకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎల్లమ్మ, గౌరవ సలహాదారు సుభద్రమ్మ మాట్లాడుతూ.. . గ్రామ శివారులోని పొదుపు భవనం ఆవరణలో ఇప్పటికే రాత్రిళ్లు మద్యం తాగుతున్నారని తెలిపారు. ఇప్పుడు మండల సమాఖ్య కార్యాలయం ఎదుటే మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే మహిళలకు రక్షణ ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు.

అనుకూలమైన విత్తనం.. అనువైన రకం



ఉమ్మడి కర్నూలు జిల్లాలో రబీ సీజన్ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఏయే నేలల్లో, ఏయే రకాల పంటలు సాగుకు అనుకూలమో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలియజేశారు. విత్తుకునేందుకు అనువైన సమయం తదితర అంశాలను ఆయన వివరించారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం

రబీలో పంటల సాగుకు సమాయత్తం

నల్లరేగడి నేలలు అనుకూలం	పంట	రకాలు
అక్టోబరు 15 - నవంబరు 15	సెనగ	నంద్యాల సెనగ-452, 857, 776, 49
అక్టోబరు 15 - నవంబరు 15	కుసుమ	ఐఎస్‌ఎఫ్-764, డీసీహెచ్ 185
నవంబరు 15 - డిసెంబరు 15	పొద్దుతిరుగుడు	ప్రభాత్ ఏడీఎస్‌హెచ్-1012
అక్టోబరు 15 - నవంబరు 15	మినుము	ఎల్బీజీ 752, 787, 904, టీబీజీ-104, 129
అక్టోబరు 15 - నవంబరు 15	జొన్న	నంద్యాల తెల్లజొన్న-4, 5, నంద్యాల పచ్చజొన్న-14

ఎర్ర నేలలు అనుకూలం	పంట	రకాలు
అక్టోబరు 15 - నవంబరు 15	మినుము	ఎల్బీజీ-752, 787, 904, టీబీజీ-129
అక్టోబరు 15 - నవంబరు 15	పెసర	ఐఎస్‌ఎఫ్-764, డీఎస్‌హెచ్-185
అక్టోబరు 15 - నవంబరు 15	జొన్న	నంద్యాల తెల్లజొన్న 4, 5 రకాలు, నంద్యాల పచ్చజొన్న 14
నవంబరు 15 - డిసెంబరు 15	వేరుసెనగ	విశిష్ట టీసీజీఎస్ 1694 రకం



బనగానపల్లి మండలంలో సాగైన పొగాకు పంట

పొగాకు తడిస్తే కుళ్లు తెగులు

బనగానపల్లి, న్యూస్‌టుడే: ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి పొగాకు పంటలో తెగుళ్లు సోకే ప్రమాదముందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎం.బాలరాజు సూచించారు. పంట వేసి ఇప్పటికి 30 నుంచి 40 రోజులవుతోందన్నారు. కొన్నిచోట్ల ఇంకా నాటుతున్నారని తెలిపారు. ఈసారి జిల్లాలో సుమారు 15 వేల ఎకరాలకుపైగా సాగు చేసినట్లు తెలిసింది. ఎడతెరిపి లేని వర్షాలతో పొగాకు పంట కొన్నిచోట్ల నేల రాలిపోతోందన్నారు. ఇప్పటికే నెల రోజులు దాటిన పంటలో వర్షంతో తెగుళ్లు సోకే ప్రమాదం ఉందన్నారు. ఇటీవల నాటిన పొలాల్లో నీరు ఎక్కువై పంట మునకకు గురవుతోందన్నారు. నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకుంటే మంచి దిగుబడి వస్తుందన్నారు.

నేల రాలితే : వర్షానికి పొగాకు నేల రాలితే 19.19.19 మందును లీటరు నీటికి 6 నుంచి 8 గ్రాములు పిచికారీ చేసుకోవాలి. లేదా యూరియా 10 గ్రాములు లీటర్ నీటికి పిచికారీ చేసుకొని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కుళ్లు తెగులు : ప్రధానంగా ఈ వర్షానికి కుళ్లు తెగులు వస్తుంది. ఈ తెగులు కింద నుంచి పైకి పాకి ఆకులు మాడిపోతాయి. దీని నివారణకు రిడోమిల్ మందును 2 గ్రాములు లేదా కాపర్ ఆక్సీక్లోరిన్ మందును 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. కుళ్లిన పొగాకును తీసి వేయాలి.

రైతేరాజు

జీవ ఎరువుతో చామంతి వికాసం



హాలహర్వి, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలతో చామంతి తోటలో ఎండు తెగులు వ్యాప్తి చెంది మొక్కలు జీవం కోల్పోతున్నాయి. వర్షం నీరు ఎక్కువగా నిలిచినా, భూమిలో తేమ ఎక్కువగా ఉన్నా మొక్కలు పసుపు రంగులోకి మారి వాలిపోతాయి. తెగులు సోకిన మొక్కల ఎదుగుదల ఆగిపోతుంది. నేలలో జీవ ఎరువు ట్రైకోడెర్మావిరిడి వేసుకోవాలి. మొక్కలు నాటే ముందు నారును ఏదైనా శిలీంధ్రనాశనిలో ముంచి నీడలో ఆరబెట్టాలి. నేలలో ఉదజని సూచిక 6.5-7 ఉండేలా చూసుకోవాలి. సమర్థంగా నివారణకు సాఫ్ 2 గ్రా॥ లేదా అమిస్టార్‌టాప్ మి.లీ. లేదా థైయోఫానేట్ మిథైల్ 2 గ్రా॥ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. బైటాక్స్ 3 గ్రా॥ లీటర్ నీటికి కలిపి మొక్కలు మొదళ్లలో బాగా ముంపుగా పోయాలి. ఈ మందులను ప్రతి 15 రోజులకు ఒకసారి మారుస్తూ పిచికారీ చేస్తే తెగులును పూర్తిగా నివారించవచ్చని ఆలూరు క్లస్టర్ ఉద్యాన శాఖ అధికారిణి ఇంద్రాణి తెలిపారు.

సీతాఫలం.. ఆదాయం ఘనం



సీతాఫలం చెట్లను చూపుతున్న రైతు నారాయణరెడ్డి

మద్దికెర, న్యూస్‌టుడే: ఆ భూమిలో ఏ పంటలు సాగు చేసినా ఆ రైతుకు ఎప్పుడూ లాభాలు రాలేదు. దీంతో మూడేళ్ల కిందట సీతాఫలం మొక్కలు తెచ్చి సాగు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన నారాయణరెడ్డి. ఆయన తనకున్న మూడెకరాల పొలంలో 1.5 ఎకరాల్లో సీతాఫలం సాగు చేపట్టారు.

1,200 మొక్కలకు రూ.48 వేలు ఖర్చు

తెలంగాణలోని జడ్చర్లలో గోల్డెన్ రకం మొక్క రూ.60 చొప్పున కొనుగోలు చేశారు. ఎకరానికి 800 మొక్కల లెక్కన 1.5 ఎకరాలకు 1,200 మొక్కలు నాటారు. ఇందుకు రూ.72 వేలు వెచ్చించారు. మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వేందుకు ఒక్కో గుంతకు రూ.40 చొప్పున రూ.48 వేలు, రవాణా, నాటేందుకు, ఇతర ఖర్చుల కింద ఇప్పటి వరకు రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు రైతు తెలిపారు. అంతే కాకుండా పొలం చుట్టూ రక్షణ కోసం కంచె ఏర్పాటుకు రూ.7 లక్షలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఇక్కడే రెండంతస్తుల గదిని నిర్మించారు. కింద గోదాముగా, పైన రైతు ఉండేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సీతాఫలానికి రసాయన ఎరువులు, పురుగుమందుల పిచికారీ కూడా తక్కువేనన్నారు.

ఎకరానికి నాలుగు టన్నుల దిగుబడి

మొక్కలు నాటిన మూడో ఏట దిగుబడి ఆరంభమైంది. ఎకరానికి నాలుగు టన్నుల దిగుబడి వస్తుందన్నారు. ఎకరానికి రూ.3 లక్షలకుపైగా ఆదాయం రానుందన్నారు. ఈ ఏడాది పంట ముగిసేలోపు పెట్టుబడి మొత్తం వస్తుందని, వచ్చే ఏడాది నుంచి వచ్చే ఆదాయమంతా లాభాలేనన్నారు. చాలా మంది తోట వద్దకే వచ్చి పండ్లను కొనుగోలు చేస్తున్నారు. కిలో రూ.60 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్తు పరికరాల అంచనా వ్యయాలు ఏపీలో ఎక్కువ

☛ సమీకృత స్వచ్ఛ ఇంధన విధానాన్ని అందిపుచ్చుకోవాలి ☛ ఏపీఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ సి.నాగార్జునరెడ్డి

ఈనాడు, కర్నూలు, వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్తు పరికరాల అంచనా వ్యయాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని అదుపు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఛైర్మన్ జస్టిస్ సి.నాగార్జునరెడ్డి అన్నారు. కర్నూలులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'రాష్ట్ర విద్యుత్తు సమన్వయ ఫోరం' సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. రాష్ట్రంలోని విద్యుత్తు ఉత్పత్తి, పంపిణీ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వ 'సమీకృత స్వచ్ఛ ఇంధన విధానం'లోని ముఖ్య అంశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అన్నిరకాల విద్యుత్తు వినియోగదారులకు ఉపయుక్తంగా ఉండేలా 2024-25 నుంచి 2028-29 ఆర్థిక సంవత్సరం వరకు ఐదేళ్లపాటు అమలులో ఉండే రాష్ట్ర విద్యుత్తు ప్రణాళికను తీర్చిదిద్దినట్లు గుర్తుచేశారు. సమీకృత స్వచ్ఛ ఇంధన విధానానికి అనుగుణంగా ఆ రాష్ట్ర ప్రణాళికను అవసరం మేరకు పునఃసమీక్ష చేయాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని విద్యుత్తు సంస్థలు ఏటా డిసెంబరు నెలాఖరు కల్లా.. ఆ తర్వాత ఆర్థిక సంవత్సరానికి అమలుచేసే 'కాస్ట్‌డేటా'కు ఏపీఈఆర్సీ అనుమతి తీసుకోవాలని గుర్తుచేశారు. ప్రతి విద్యుత్తు పంపిణీ సంస్థ పరిధిలో విద్యుత్తు నియంత్రణ మండలి తరఫున ఒక ప్రత్యేకాధికారిని నియమించామని తెలిపారు. వారు సంస్థ పరిధిలోని లైన్లు, ఉప కేంద్రాలు తనిఖీ చేసి భద్రతా చర్యల నిమిత్తం తగిన సలహాలు, సూచనలు చేస్తారని.. వాటిని కమిషన్ ఆదేశాలుగా పరిగణించి పంపిణీ సంస్థలు అమలుచేయాలని పేర్కొన్నారు. వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలు అందించడమే లక్ష్యంగా విద్యుత్తు పంపిణీ సంస్థ పనిచేయాలని చెప్పారు. రాష్ట్ర విద్యుత్తు ప్రణాళిక ఉద్దేశాలు, లక్ష్యాలను రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఈఆర్సీ సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, వెంకటరామరెడ్డి, పంపిణీ సంస్థల సీఎండీలు పి.రవి, సంతోష్‌రావు, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, ఎన్టీపీసీ, సెకి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జస్టిస్ సి.నాగార్జునరెడ్డి. చిత్రంలో రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ తదితరులు

కత్తి దూసి.. విజేతలుగా నిలిచి

☛ ఫెన్సింగ్‌లో రాణిస్తున్న నంద్యాల క్రీడాకారులు



నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : ఆటలపై ఆసక్తి పలువురు విద్యార్థులను విజయాల బాట పట్టిస్తోంది. నచ్చిన క్రీడలో శిక్షణ పొందుతూ.. నిత్యం సాధనతో నైపుణ్యాలు పెంపొందించుకుని పోటీల్లో విజేతలుగా నిలుస్తున్నారు. ఇదే బాటలో నంద్యాల పట్టణానికి చెందిన యువకిరణ్, నాగలక్ష్మీచరణ్‌జిత్, శిశిరగ్రేస్‌లు ఫెన్సింగ్ క్రీడను నేర్చుకుని.. పోటీల్లో సత్తా చాటుతున్నారు. ప్రత్యర్థులను చిత్తు చేస్తూ.. రాష్ట్ర, జాతీయస్థాయిలో విజేతలుగా నిలిచి పతకాలు సాధిస్తున్నారు. మరోసారి జాతీయస్థాయికి ఎంపికవ్వాలన్న పట్టుదలతో.. ప్రస్తుతం నంద్యాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పోరాడుతున్నారు.

యువ కిరణ్.. ఆటలో మెరిసెన్

డోన్‌కు చెందిన యువకిరణ్ ప్రస్తుతం స్థానిక జడ్పీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. క్రీడలపై ఆసక్తితో 6వ తరగతి నుంచే వ్యాయామ ఉపాధ్యాయుడు సుధాకర్ దగ్గర ఫెన్సింగ్‌లో శిక్షణ పొందాడు. పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. 2024లో జనవరిలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో తలపడి ప్రశంసాపత్రం అందుకున్నాడు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో 2022లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ, 2023 నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానాలు సాధించాడు.



చరణ్‌జిత్.. ప్రత్యర్థులు చిత్తు

నంద్యాల పట్టణం ఎస్‌బీఐ కాలనీకి చెందిన నాగలక్ష్మీచరణ్‌జిత్ ప్రస్తుతం ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఫెన్సింగ్ క్రీడపై ఆసక్తితో గత మూడేళ్ల నుంచి శిక్షణ తీసుకుంటున్నాడు. కాకినాడ, నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించాడు. 2023లో కేరళలో, 2024 ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రాలు అందుకున్నాడు. అంతర్జాతీయస్థాయి పోటీల్లో రాణించాలనే లక్ష్యంతో మెలకువలు నేర్చుకుంటూ సాధన చేస్తున్నట్లు చెబుతున్నాడు చరణ్‌జిత్.



శిశిరగ్రేస్.. శభాష్

నంద్యాల పట్టణం మిషన్ కాంపౌండ్‌కు చెందిన మిద్దె శిశిరగ్రేస్ ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. 2018 నుంచి ఫెన్సింగ్ క్రీడలో డీఎస్‌ఏ శిక్షకుడు లక్ష్మణ్ వద్ద శిక్షణ తీసుకుంటోంది. 2022, 2023, 2024లో జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రాలు అందుకుంది. 2022 నుంచి 2024 వరకు వరుసగా జిల్లా, రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించింది. అంతర్జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో విజేతగా నిలవడమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్లు చెబుతోంది శిశిరగ్రేస్.



పవిత్రోత్సవం... పుణ్యప్రదం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ఆలయంలో సంవత్సరం పాటు నిర్వహించిన పూజల్లో జరిగిన తప్పుల నివారణకు అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రాయశ్చిత్తం కోరుతూ అర్చకులు స్వామిని భక్తిశ్రద్ధలతో అర్చిస్తున్నారు. ఐదు రోజుల నుంచి దిగువ అహోబిలంలో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవాలు శాస్త్రోక్తంగా సాగుతున్నాయి. సోమవారం స్వామిని సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య ఆరాధనలు చేశారు. అనంతరం యాగశాలలో ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు ఎదురుగా హోమ గుండాల్లో హోమం జరిపారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా పూజించి మంగళహారతి అందించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను పల్లకిపై కొలువుదీర్చి తిరువీధి ఉత్సవం జరిపారు. రాత్రి నిత్య పూజలు చేసి వేదమంత్రాలతో హోమం జరిపి పూర్ణాహుతి చేపట్టారు. తమిళనాడు, తిరుపతికి చెందిన వేదపండితుల బృందం వేదప్రబంధ పారాయణాలు పఠించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

అడుగుకో గుంత.. అడుగేయలేనంత



ఆళ్లగడ్డ పట్టణ పరిధిలోని పి.చింతకుంట ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. పి.చింతకుంటలోని ఆరోగ్య ఉపకేంద్రం సమీపంలో గుంతల్లో నీరుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆళ్లగడ్డ నుంచి కోవెలకుంట్లకు నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డులోనే ప్రయాణిస్తుంటాయి. చీకట్లలో గోతులు కన్పించకపోవడంతో ప్రమాదాలపాలవుతున్నామని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోతుల్ని పూడాల్చని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

ఆహ్లాదానికి దూరం... కానరాని జల విహారం



జల విహార కేంద్రంలో పర్యాటక బోటు వ్యర్థాల చెంతన చేరింది. ప్రస్తుతం అవుకు జలాశయం తూముల వద్ద కూరుకుపోయింది. రెండేళ్ల కిందట జరిగిన ప్రమాదం అనంతరం జలవిహార కేంద్రం మూత పడింది. విలువైన బోట్లు పోలీసుస్టేషన్‌లో తుప్పుపట్టి పోగా, వాటిని నిలువరించే స్టాండ్లు నీటిలో కొట్టుకుపోయి వ్యర్థాల మధ్యకు చేరాయి. మూతపడిన జల విహార కేంద్రాన్ని తిరిగి అందు బాటులోనికి తీసుకురావడంలో అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, అవుకు

తండ్రి మందలించాడని ఆత్మహత్య



లోకేశ్ కుమార్ (పాత చిత్రం)

గూటుపల్లె(బేతంచెర్ల), న్యూస్‌టుడే: అల్లరిచిల్లరగా తిరుగుతున్నాడని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన యువకుడు పురుగుమందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. సీహెచ్ రామసుబ్బయ్య, లక్ష్మీదేవిల కుమారుడు లోకేశ్ కుమార్ (21) బేతంచెర్ల పట్టణంలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. కళాశాలకు వెళ్లకుండా అల్లరిచిల్లరగా తిరుగుతున్నాడని తండ్రి మందలించడంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెచ్‌సీ చంద్రశేఖరప్ప సోమవారం తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రైల్వేట్రాక్ ఎదుట వ్యక్తి మృతి

డోన్‌పట్టణం, కృష్ణగిరి, న్యూస్‌టుడే: బి.రామదుర్గం గ్రామానికి రెండు, మూడు కి.మీ.ల దూరంలో కృష్ణగిరి మండలంలోని పులిచెర్లకు ఎదురుగా రైల్వేట్రాక్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారని డోన్ రైల్వే జీఆర్పీ పోలీసులు సోమవారం తెలిపారు. నాలుగు రోజుల కిందట మృతి చెంది ఉండొచ్చునని, 50 ఏళ్లు ఉంటాయని పోలీసులు తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే రైల్వే జీఆర్పీ ఎస్సై (కర్నూలు) 9440627654, ఆర్పీహెచ్‌సీ (డోన్) 9849492653 నంబర్లకు ఫోన్ చేయాలని జీఆర్పీ హెచ్‌సీ మధుకుమార్ కోరారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జనవరి 15లోగా పనులు పూర్తి చేయాలి



సమస్యలు వింటున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాల్లో శంకుస్థాపన చేసిన 1026 పనులను వచ్చే ఏడాది జనవరి 15వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ జి.రాజకుమారి ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నంద్యాల సెంటినరీ హాల్‌లో సోమవారం ఆమె సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు, పల్లె పండగ వారోత్సవాలు, ఈ-ఆఫీసు, రెవెన్యూ సదస్సులు, 200 రోజుల కార్యాచరణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పటిష్ఠ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. వెబ్‌ల్యాండ్ ప్రకారం కాకుండా సాగులో ఉన్న వ్యక్తుల పేర్లు మాత్రమే ఓటర్ల జాబితాలో పొందుపరచాలని స్పష్టం చేశారు. జిల్లాలో 122 కార్యాలయాల నుంచి అన్ని దస్త్రాలు ఈ-ఆఫీసు ద్వారానే రావాలన్నారు. దాతలు అందజేసిన ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లను సంక్షేమ వసతిగృహాల్లో ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఓటరు నమోదుకు సంబంధించి స్వీప్ కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ రీసర్వే చేసిన 173 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సర్వేకు సంబంధించిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో పద్మజ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

ఆ ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ప్రజా ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధపెట్టి పరిష్కరించాలని కలెక్టర్ జి.రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. నంద్యాల సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఆమె 211 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డీఆర్వో పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఫెన్సింగ్ పోటీలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం పద్మావతినగర్‌లోని డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-17 బాల బాలికల ఫెన్సింగ్ పోటీలు రెండోరోజు సోమవారం హోరాహోరీగా కొనసాగాయి. భాజపా జిల్లా సమన్వయకర్త అభిరుచి మధు క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం.ఎన్.వి.రాజు విజేతలకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపీరెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర, దండే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

నైపుణ్యాలు జోడిస్తేనే మానవాళికి ప్రయోజనం



విక్టోరియన్ పార్లమెంటులో ప్రసంగిస్తున్న డా.బైరెడ్డి శబరి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : సాంకేతిక, శాస్త్రీయ నైపుణ్యాలను జోడించినప్పుడే మానవాళికి ప్రయోజనం కలుగుతుందని నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి పేర్కొన్నారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విక్టోరియన్ పార్లమెంటును ఉద్దేశించి సోమవారం ఆమె ప్రసంగించారు. భారతీయుల మానవత్వం, సేవాగుణం, అగ్రరాజ్యాలకు దీటుగా భారత్ ఆర్థికంగా ఎదగడం, ఎగుమతులు, దిగుమతులు తదితర అంశాలను ప్రస్తావించారు. విక్టోరియన్ పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం తనకు కల్పించిన ఆస్ట్రేలియా, భారత ప్రధానులు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

పిన్నాపురాన్ని సందర్శించిన విదేశీ బృందం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని పిన్నాపురం గ్రామంలో గ్రీన్‌కో సంస్థ నిర్మిస్తున్న విద్యుదుత్పత్తి కేంద్రాన్ని విదేశీ బృందం సోమవారం పరిశీలించింది. బృందం సభ్యులు ట్రయల్ రన్ నిర్వహించి జల విద్యుదుత్పత్తిని పరిశీలించినట్లు స్థానికులు తెలిపారు. విదేశీ బృందం పర్యటన నేపథ్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ వివరాలేవీ బయటకు రాకుండా గ్రీన్‌కో సంస్థ గోప్యంగా ఉంచింది.

డీఎస్సీ శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : డీఎస్సీ ఉచిత శిక్షణ ఇచ్చే సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల సంక్షేమ సాధికారత అధికారిణి చింతామణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో 5,050 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకునే శిక్షణ సంస్థలు కనీసం గత రెండు డీఎస్సీల సందర్భంగా అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి ఉండాలన్నారు. గత డీఎస్సీలో ఆ శిక్షణ సంస్థల నుంచి కనీసం వంద మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు పొంది ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన సంస్థలు ఏపీ.ఈప్రొక్యూర్‌మెంట్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రెసిడెన్సియల్ విధానంలో ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం జన్మభూమి.ఏపీ.జీవోవీ.ఇన్‌లో ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

25 వరకు దరఖాస్తుకు అవకాశం

బనగానపల్లి, న్యూస్‌టుడే: ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు చేసుకోవడానికి గడువును పొడిగించినందున ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారి చిన్నరాముడు సోమవారం తెలిపారు. ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

నంద్యాల

• నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

112, 1930 టోల్‌ఫ్రీ నంబర్లతో రక్షణ

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : ఆపదలో ఉన్న మహిళలు, చిన్న పిల్లలు 112, 1930 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేస్తే పోలీసు రక్షణ లభిస్తుందని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా చెప్పారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో మహిళా పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో 112, 1930 నంబర్లపై అవగాహన కల్పిస్తూ ముద్రించిన ప్రచార పత్రాలను సోమవారం విడుదల చేశారు. వీటిని కళాశాలలు, రైల్వేస్టేషన్, ఇతర ప్రాంతాలతో పాటు ఆటోలపై ఏర్పాటు చేసి యువత, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐలు జయరాములు, రమేశ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆటోకు పోస్టర్ అతికిస్తున్న ఎస్పీ, పోలీస్ అధికారులు

పోలింగ్ కేంద్రాల నంబర్లు మార్పు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : నంద్యాల నియోజకవర్గంలోని ఐదు పోలింగ్ కేంద్రాలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నూతన వరస నంబర్లు కేటాయించినట్లు తహసీల్దారు ప్రియదర్శిని సోమవారం తెలిపారు. గతంలో 26ఏగా ఉన్న కేంద్రానికి 27, 137ఏకు 139, 168ఏకు 171, 171ఏకు 175, 223ఏ నంబరు కలిగిన పోలింగ్ కేంద్రానికి 228వ నంబరు కేటాయించారని వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

పాణ్యం గ్రామీణం : **సమస్య :** బలపనూరు మెట్ట వద్ద జాతీయ రహదారిపై బస్ షెల్టరు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. **- రవికుమార్, కౌలూరు**

సమస్య : పాణ్యం బస్టాండులో వసతులు కరవయ్యాయి. **- వరప్రసాద్, స్థానికుడు**

సమాధానం : జాతీయ రహదారి అధికారుల దృష్టికి తీసుకెళ్లి బస్ షెల్టర్ ఏర్పాటుకు కృషి చేస్తాం. **- ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో, పాణ్యం**

24లోగా ఉల్లాస్ సర్వే పూర్తి చేయాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వ పథకం ఉల్లాస్ కింద నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే సర్వే ప్రక్రియను ఈనెల 24వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సోమవారం ఆమె ఉల్లాస్ కార్యక్రమంపై జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ఏడాది లక్ష్యంగా నిర్దేశించిన 26,784 మంది నిరక్షరాస్యుల వివరాలను ఉల్లాస్ యాప్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు వారికి ఉచిత విద్యా బోధన అందించేందుకు స్వచ్ఛంద ఉపాధ్యాయులను గుర్తించాలన్నారు. ఐదేళ్లపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థలు, సామాజిక కార్యకర్తలను భాగస్వాములను చేయాలన్నారు. డీఆర్డీఏ, ఐసీడీఎస్, విద్యాశాఖ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డీఈవో సుధాకర్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ లీలావతి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పాణ్యం గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలోని రసూల్‌పేట గ్రామానికి చెందిన యువకుడు జనార్దన్ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు సోమవారం స్థానికులు తెలిపారు. బంధువుల అమ్మాయిని పెళ్లి చేసుకున్న విషయంలో సమస్యలు రావడంతో అమ్మాయి బంధువులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఇరువర్గాల వారు పాణ్యం పోలీసు స్టేషన్ వద్దకు చేరుకొని మాట్లాడుకున్నారు. దీంతో మనస్తాపం చెందిన యువకుడు పాణ్యం బస్టాండు సమీపంలో పురుగుల మందు తాగారు. గుర్తించిన బంధువులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల వారు బంధువులు కావడంతో సమస్యపై మాట్లాడుకున్నారని, పోలీసు స్టేషన్ బయటకు వెళ్లాక యువకుడు పురుగుల మందు తాగినట్లు ఎస్సై నరేంద్రకుమార్‌రెడ్డి వివరించారు.

ఉప విభాగం.. నేరాల నిలయం

★ అడ్డూఅదుపు లేని హత్యలు, దొంగతనాలు ★ ఆత్మకూరు సబ్ డివిజన్‌లో కట్టుతప్పిన శాంతిభద్రతలు



నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : ఆత్మకూరు పోలీసు సబ్ డివిజన్‌లో రోజురోజుకూ నేరాలు పెరుగుతున్నాయి. ఆరు నెలల నుంచి అసాంఘిక కార్యకలాపాలు జోరందుకున్నాయి. చోరీలు, హత్యలు, [illegible] అధికమవుతున్నాయి. పేకాట, మట్కా, నాటుసారా తయారీ, విక్రయాలు, రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. నేరాల [illegible] సబ్ డివిజన్ పరిధిలో జరుగుతున్నప్పటికీ రికార్డుల్లో తక్కువ సంఖ్యలో చూపుతూ కొన్నింటిని బయటకు రానివ్వడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

సబ్ డివిజన్	ఆత్మకూరు
మండలాలు	10
పోలీసు స్టేషన్లు	11
ఎస్సైలు	17 మంది
సీఐలు	ఆరుగురు

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో నేరాలు

నెల	చోరీలు	హత్యలు	నాటుసారా	జూదం	మట్కా
ఆగస్టు	3	3	99	5	2
సెప్టెంబరు	5	2	230	2	--

ప్రాణాలకు రక్షణ కరవు

★ వెలుగోడు మండలంలోని బోయరేవుల గ్రామంలో మద్యం మత్తులో తమ్ముడే అన్నను రోకలిబండతో కొట్టి చంపాడు.

★ నందికొట్కూరు పట్టణం మారుతీనగర్‌లో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది.

★ ఆత్మకూరు మండలం కరివేన గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని కొందరు హత్య చేసి వాగులో పడేయడంతో పాములపాడు మండలం ఎర్రగూడూరు వద్ద మృతదేహం తేలింది.

★ శ్రీశైలం వన్‌టౌన్ పోలీసు స్టేషను పరిధిలో ఓ వ్యక్తిపై శీతలపానీయాల సీసాతో కొట్టడంతో చనిపోయాడు.

★ పగిడ్యాల మండలం ముచ్చుమర్రి పోలీసు స్టేషన్ పరిధిలో ఎనిమిదేళ్ల బాలికపై హత్యాచారం కేసును మూడు నెలలైనా చేధించలేకపోయారు.

★ నందికొట్కూరు మండలం నాగటూరులో మామే కోడలిని బండరాయితో మోది హత్యచేశాడు.

ప్రార్థనాలయాల్లోనూ చోరీలు

★ ఆత్మకూరు మండలంలోని రాచాపురం మలుపు వద్ద ఉన్న ఓ ఆలయంలో రెండుసార్లు దొంగలుపడి హుండీలోని నగదు ఎత్తుకెళ్లారు.

★ ఆత్మకూరు పట్టణం ఆర్టీసీ బస్టాండు వెనకవైపున ఉన్న శివాలయం తాళం పగలగొట్టి హుండీలోని రూ.30 వేలు చోరీ చేశారు.

★ కొత్తపల్లిలోని కొక్కెరంచ, ఎదురుపాడు గ్రామాల్లోని మసీదుల్లో నగదు, సామగ్రి అపహరించారు.

★ వెలుగోడు మండలం వేల్పనూరులో తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి 16 తులాల బంగారం, రూ.45 వేల నగదు చోరీ చేశారు.

మద్యం.. బియ్యం అక్రమ వ్యాపారం

★ రెండు నెలల్లో నాటుసారా 329, అక్రమ మద్యం కేసులు 47 నమోదు చేశారు.

★ రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న ఆరుగురిని అరెస్టు చేసి ఎనిమిది క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

★ పేకాట కేసుల్లో 37 మంది జూదరులను అరెస్టు చేసి రూ.68 వేలు స్వాధీనం చేసుకున్నారు.

★ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై 1078, ధూమపానం చేసిన వారిపై 11,740, తాగి వాహనాలు నడిపిన వారిపై 87, రహదారి నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.3,91,970 జరిమానా విధించారు.

నిఘా పెడుతున్నాం - రామాంజనాయక్, డీఎస్పీ

ఆత్మకూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో చోరీలను అరికట్టేందుకు పాత నేరస్తులపై నిఘా ఉంచాం. వారికి కౌన్సెలింగు ఇస్తున్నాం. దొంగతనాల కేసుల్లో నేరస్తులను అరెస్టు చేసి సొమ్ము రికవరీ చేస్తున్నాం. మట్కా, జూదం నిర్వాహకులు, నాటుసారా తయారు చేసేవారిపై దాడులు నిర్వహిస్తున్నాం.



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గొర్రెపిల్లకు మందు వేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య పేర్కొన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో గొర్రెలకు నట్టల నివారణ మందు వేసే కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువైద్యులు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా, న్యూస్‌టుడే : మండలంలో ప్రత్యేకంగా నిర్వహించనున్న ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గోపీకృష్ణ సూచించారు. ఈనెల 22 నుంచి గ్రామాల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు సోమవారం ఆయన తెలిపారు. ఈనెల 22న పారుమంచాల, 23న తరిగోపుల, 24న 80 బన్నూరు, 25న తాటిపాడు గ్రామాల్లో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. వీటిలో ఆధార్ కార్డుల్లో పుట్టిన తేదీ, చిరునామా, పేరు, తదితర వివరాల చేర్పులు, మార్పులు చేసుకోవచ్చని వివరించారు.

మహానందీశునికి పల్లకి సేవ

మహానంది, న్యూస్‌టుడే : మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామికి పల్లకి సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు వేదోక్తంగా పూజా కైంకర్యాలు జరిపించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఉత్సవంలో నంద్యాలకు చెందిన దాత లక్కబోయిన ప్రసాద్, ఆదిలక్ష్మమ్మ దంపతులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న పండితులు, అర్చకులు

అభివృద్ధి పనుల పరిశీలన

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను దేవస్థానం ఇన్‌ఛార్జి ఈవో ఇ.చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. పంచమఠాల ప్రాంగణాల్లో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు రహదారి నిర్మించాలని ఈఈ ఎం.నరసింహారెడ్డిని ఆదేశించారు. గంగాధర మండపం సమీపంలో స్వర్ణరథం కోసం ప్రత్యేకంగా రథశాల నిర్మించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఏనుగు చెరువులో బోటింగ్ నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. భక్తుల సౌకర్యార్థం మరిన్ని ఏటీఎం యంత్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రాబోయే మహాశివరాత్రిని దృష్టిలో పెట్టుకొని సిద్ధరామప్ప కాంప్లెక్స్-ఆర్టీసీ బస్టాండు మధ్య ఉన్న ఖాళీ స్థలంలో శౌచాలయాలను త్వరగా నిర్మించాలన్నారు.



ఇంజినీర్లకు సూచనలు ఇస్తున్న ఇన్‌ఛార్జి ఈవో చంద్రశేఖర్‌రెడ్డి

ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి


నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని కోరుతూ పోస్టుకార్డు ఉద్యమం చేపట్టినట్లు డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ తెలిపారు. ఈనెల 22 నుంచి 28 వరకు జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పార్టీ ఇన్‌ఛార్జులు, కోఆర్డినేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తూ మహిళలకు పోస్టుకార్డు ఉద్యమం గురించి వివరించి వారితోనే సీఎం చిరునామాకు లేఖలు రాయించనున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు దాటుతున్నా ఉచిత బస్సు ప్రయాణం గురించి పట్టించుకోలేదని విమర్శించారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు

మల్లన్న సేవలో సినీ నిర్మాత దిల్‌రాజు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లను సినీ నిర్మాత దిల్ రాజు సోమవారం దర్శించుకున్నారు. స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు.



శ్రీశైలంలో నిర్మాత దిల్‌రాజు

కబ్జాకు గురైన స్థలాలు స్వాధీనం చేసుకోండి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలో కబ్జాకు గురైన రూ.కోట్ల విలువైన పురపాలక స్థలాలను అధికారులు స్వాధీనం చేసుకొని ప్రజావసరాలకు ఉపయోగించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ కోరారు. నంద్యాల సెంటినరీ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సీపీఐ నాయకులు కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు ప్రసాద్, సోమన్న పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు వడ్డీ రహిత రుణాలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : చిరు వ్యాపారులకు భవిష్యత్తులో వడ్డీ లేని రుణాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషిచేస్తామని జిల్లా చిరు వ్యాపారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు ఆకుమల్ల రహీమ్ తెలిపారు. స్థానిక సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పట్టణ అధ్యక్షుడిగా ఆటోనగర్ జి.వాసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మదార్‌వలి, కోశాధికారి అన్వర్, సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ శివరామిరెడ్డి, నాయకులు సంజీవరాజు, చంద్రపాల్, మహేశ్వర ఆచారి, నాగరాముడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న చిరు వ్యాపారుల సంఘం నాయకులు

పంటనష్టం వివరాలు ప్రభుత్వానికి పంపుతాం

మహానంది, న్యూస్‌టుడే : వర్షాల వల్ల పంటలకు జరిగిన నష్టం వివరాలను ప్రభుత్వానికి పంపుతామని నంద్యాల డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డి.రాజశేఖర్ చెప్పారు. మహానంది మండలంలోని బొల్లవరం, నందిపల్లె తదితర గ్రామాల పరిధిలో వర్షాలకు పడిపోయిన వరిపంటను సోమవారం ఆయన పరిశీలించారు. వరి పొలాల్లో నిలిచిన నీటిని వెంటనే తీసేయాలన్నారు. వరి పైరును కట్టలుగా కట్టి కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.నాగేశ్వరరెడ్డి, గ్రామ వ్యవసాయాధికారులు లక్ష్మీకాంత్, చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.



సూర్యనంది వద్ద రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ రాజశేఖర్

చెంచులకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

జూపాడుబంగ్లా, న్యూస్‌టుడే : మండలంలోని సిద్దేశ్వరం, 80 బన్నూరు గ్రామాలకు చెందిన చెంచులకు స్థలాలు ఇచ్చి పక్కా ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సీపీఎం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వెంటనే వారికి స్థలాలు, ఇళ్లు మంజూరు చేయకపోతే బాధితులతో కలిసి ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పోటీలతో సృజనకు పదును



బహుమతులు అందుకున్న విజేతలు

‘ఈనాడు’ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీలు విద్యార్థుల సృజనకు పదును పెడతాయని నంద్యాల కేశవరెడ్డి విద్యాసంస్థల అధినేత ఎన్.కేశవరెడ్డి పేర్కొన్నారు. స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లోని కేశవరెడ్డి పాఠశాలలో సోమవారం ‘ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ, నష్టాలు- విద్యార్థులపై సోషల్‌మీడియా ప్రభావం’ అనే అంశంపై ‘ఈనాడు’ ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు జరిగాయి. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన తొమ్మిదో తరగతి విద్యార్థులు సి.లాస్య, ఎం.మిథిల్‌రాయల్, బి.వేదఅక్షరవ్యాస్‌లకు పాఠశాల ఏవో ఎం.ఆర్.టి.ప్రసాద్ బహుమతులు అందజేశారు. - న్యూస్‌టుడే, నంద్యాల గాంధీచౌక్



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న కేశవరెడ్డి పాఠశాల విద్యార్థులు

ప్రతిభకు గుర్తింపు

పోటీ పరీక్షలతో విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని ఆత్మకూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు పేర్కొన్నారు. స్థానిక పాఠశాలలో ‘ఈనాడు’ ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 9వ తరగతి విద్యార్థిని అనీశా తబస్సుమ్ ప్రథమ, పదో తరగతి విద్యార్థినులు కీర్తిప్రియ ద్వితీయ, లక్ష్మీప్రసన్న తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఝాన్సీరాణి, కేశన్న, శివప్రసాద్ బహుమతులు అందజేశారు.
– న్యూస్‌టుడే, ఆత్మకూరు, ఆత్మకూరు పట్టణం



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు కంటి పరీక్షలు

జూపాడుబంగ్లా, న్యూస్‌టుడే : మండలంలోని గురుకుల పాఠశాలలో సోమవారం విద్యార్థులకు కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నేత్రవైద్య సహాయకుడు డాక్టర్ హనీఫ్ పాఠశాలలోని సుమారు 250 మంది విద్యార్థుల కళ్లు పరీక్షించారు. సుమారు 50 మందికి అద్దాలు అవసరమని ప్రతిపాదనలు పంపించారు. కొందరు విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం కర్నూలు కంటి వైద్యశాలకు సిఫార్సు చేశారు. నేత్ర సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల ప్రిన్సిపల్ సత్యనారాయణమూర్తి, వైఎస్ ప్రిన్సిపల్ ఉమామహేశ్వరశర్మ, హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెంచు రైతులకు విద్యుత్తు సౌకర్యం

మహానంది, న్యూస్‌టుడే : మండలంలోని చెంచులక్ష్మి గూడేనికి చెందిన రైతుల పొలాలకు సోమవారం విద్యుత్తు సౌకర్యం కల్పించినట్లు ఏఈఈ ప్రభాకరరెడ్డి తెలిపారు. కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు 11 కేవీ విద్యుత్తు లైన్లు, నియంత్రికలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. చెంచులు భూములు సాగుచేసుకుని జీవనోపాధి పొందేందుకు విద్యుత్తు సౌకర్యం కల్పించినట్లు వివరించారు. ఆర్ఐ వెంకటసుబ్బారావు, వీఆర్వో చలమయ్య, డీర్వో రాధాకృష్ణ, ఎఫ్‌బీవో ప్రతాప్ పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని కోళ్లబావాపురం అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న నాటుసారా స్థావరాలపై దాడిచేసి వెయ్యిలీటర్ల బెల్లంఊట ధ్వంసం చేసినట్లు ఆబ్కారీ ఎస్సై జఫ్రుల్లా సోమవారం తెలిపారు. నాటుసారా తయారు చేస్తున్న వారి కోసం గాలిస్తున్నామన్నారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సున్నిపెంట.. వానొస్తే తంట

సున్నిపెంటలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. పలు ప్రాంతాల్లో మురుగు కాల్వలు లేవు. కొన్నిచోట్ల ఉన్నా ఆక్రమణలతో పూడిపోయాయి. దీంతో వర్షం కురిసిన ప్రతిసారీ రహదారులపై నీరు ప్రవహిస్తోంది. సోమవారం కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు వంకలను తలపించాయి. అంబేడ్కర్ కూడలి నుంచి బస్టాండుకు వెళ్లే రహదారిపై నీరు నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
– న్యూస్‌టుడే, సున్నిపెంట సర్కిల్



బాలికలు.. బరిలో విజేతలు

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థినులు చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టిసారిస్తున్నారు. సరైన వసతులు, శిక్షణ లేకున్నా పట్టుదలతో ఆట నేర్చుకుని.. కఠోర సాధనతో నైపుణ్యం మెరుగుపర్చుకుంటున్నారు. గురువుల ప్రోత్సాహంతో పోటీల్లో తలపడి విజేతలుగా నిలుస్తున్నారు. కొత్తపల్లి కేజీబీవీ, మండ్లెం పాఠశాల విద్యార్థినులు ఇదే కోవలో రాణిస్తూ నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించి ప్రశంసలు అందుకుంటున్నారు.

అక్షయ.. వాలీబాల్‌లో మాయ



జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామానికి చెందిన కుమ్మరి రాధమ్మ, రాముడు దంపతుల కుమార్తె అక్షయ. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. వాలీబాల్ పట్ల ఆసక్తితో నేర్చుకుంది. పాఠశాలలో పీఈటీ శ్రీనివాసులు వద్ద శిక్షణ తీసుకుంది. మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపింది. దీంతో రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వాలీబాల్ క్రీడలో జాతీయస్థాయిలో రాణించడమే తన లక్ష్యమంటోంది అక్షయ.

శ్రుతి.. కబడ్డీలో ఖ్యాతి

కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన మరియమ్మ, భాస్కర్ దంపతుల కుమార్తె శ్రుతి. కొత్తపల్లి కేజీబీవీ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. కబడ్డీ క్రీడపై మక్కువతో నేర్చుకుంది. పాఠశాల పీఈటీ స్వప్న శిక్షణలో ఆటలో మెలకువలు నేర్చుకుంది. మండల, నియోజకవర్గ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. జాతీయ స్థాయిలో మంచి క్రీడాకారిణిగా గుర్తింపు పొంది క్రీడా కోటాలో ఉద్యోగం సాధించడమే తన లక్ష్యం అంటోంది శ్రుతి.



నాగవైష్ణవి.. పోటీల్లో మేటి

కొత్తపల్లి మండలం కొక్కెరంచ గ్రామానికి చెందిన నాగరాణి, సురేశ్‌గౌడ్ దంపతుల కుమార్తె నాగవైష్ణవి. కొత్తపల్లి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 9వ తరగతి చదువుతోంది. కబడ్డీ క్రీడ పట్ల ఆసక్తితో పాఠశాల పీఈటీ స్వప్న వద్ద శిక్షణ పొందింది. తక్కువ కాలంలోనే మెలకువలు నేర్చుకుని పోటీల్లో ప్రతిభ చూపుతోంది. మండల, నియోజకవర్గ స్థాయి పోటీల్లో రాణించి ఇటీవల జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. జాతీయస్థాయిలో ఉత్తమ క్రీడాకారిణిగా గుర్తింపు పొందడమే తన ఆశయమని చెబుతోంది నాగవైష్ణవి.



నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : నంద్యాల మండలంలో భూముల రీసర్వే జరిగిన గ్రామాల్లో మంగళవారం నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ప్రియదర్శిని సోమవారం తెలిపారు. 22 అయ్యలూరు, 23 బిల్లలాపురం, 24న చాబోలు, 25న చాపిరేవుల, 26న గుంతనాల, 29న పెద్దకొట్టాల, 30న మిట్నాల, నవంబరు 1వ తేదీ మునుగాల, 2న పోలూరు, 5న పుసులూరు, 6న రాయమాల్పురం, 7న ఉడుమాల్పురం, 8న బ్రాహ్మణపల్లె, 12న పులిమద్ది గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తారన్నారు. ఆయా గ్రామాల్లోని రైతులు రీసర్వేలో తతెల్తిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

ఆత్మకూరు, న్యూస్‌టుడే : మండలంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు రత్నరాధిక తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామసభలు జరుగుతాయన్నారు. 22న కరివేన, 23న కృష్ణాపురం, 24న నల్లకాల్వ, 25న పిన్నాపురం, 26న సిద్ధాపురం, 29న సిద్దేపల్లి, 30న వడ్లరామాపురం గ్రామాల్లో సభలు ఉంటాయన్నారు.

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు మండలంలో మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. 22న అల్లూరు, 23న బిజినవేముల, 24న బొల్లవరం, 25న బ్రాహ్మణకొట్కూరు, 26న దామగట్ల, 29న కొణిదేల, 30న మద్దిగట్ల, నవంబరు 1న శాతనకోట, 2న వడ్డెమాను గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

వెలుగోడు, బండిఆత్మకూరు, న్యూస్‌టుడే : వెలుగోడు, బండిఆత్మకూరు మండలాల్లో నేటి నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్లు శ్రీనివాస్ గౌడ్, ఆల్ఫ్రెడ్ సోమవారం తెలిపారు. వెలుగోడు మండలంలో 22న బోయరేవుల, 23న మోతుకూరు, 24న అబ్దుల్లాపురం, 25న గుంతకందాల, 26న రేగడగూడూరు, బండిఆత్మకూరు మండలంలో 22న భోజనం, 23న ఎ.కోడూరు, 24న బి.కోడూరు, 25 కాకనూరు, 26 నారాయణాపురం, 29 పరమటూరు, 30 పార్నపల్లె, నవంబరు 1న పెద్దదేవళాపురం, 2న సంతజూటూరు, 5న యర్రగుంట్ల గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయన్నారు.

రాయితీపై శనగ విత్తనాల పంపిణీ

గడివేముల, న్యూస్‌టుడే : మండలంలోని ఎల్‌కే తండా రైతులకు ఎస్టీ ఉప ప్రణాళిక కింద వందశాతం రాయితీపై శనగలు పంపిణీ చేసినట్లు శాస్త్రవేత్తలు రామకృష్ణారావు, నీలిమ తెలిపారు. అఖిలభారత శనగల సమన్వయ పరిశోధన పథకంలో భాగంగా ఒక్కో రైతుకు 40 కిలోల నంద్యాల గ్రామ్ 857 రకం శనగలు పంపిణీ చేసినట్లు చెప్పారు. వీటితో పాటు లీటరు వేపనూనె, క్లోరానింట్రానిలిప్రోల్ 60 మి.లీ, హెక్సాకొనజోల్ 500 మి.లీ, టార్పాలిన్ పట్టను ఉచితంగా ఇచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు చైతన్య, జాన్సన్, వ్యవసాయాధికారి హేమసుందరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాయితీ శనగలు, మందులు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు రామకృష్ణారావు, నీలిమ


ప్రాకార ఉత్సవంలో భక్తులు

కమనీయం... ఉమామహేశ్వరుడి పల్లకి ఉత్సవం

యాగంటి(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండల పరిధిలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉమామహేశ్వరుడి పల్లకి ఉత్సవం నిర్వహించారు. పల్లకిలో ఉత్సవ విగ్రహాలు ఉంచి ప్రత్యేక పూజలు, అనంతరం ప్రాకార ఉత్సవం చేపట్టారు. పాతపాడు సర్పంచి మహేశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

సభ్యత్వ నమోదు సద్వినియోగం చేసుకోండి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ఈనెల 26 నుంచి జరగబోయే తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. సభ్యత్వం తీసుకోవడం వల్ల భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే పార్టీ తరఫున రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు బీమా పొందవచ్చన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

బేతంచెర్ల: **సమస్య:** కొమ్మూరుకొట్టాలలో కాలువలపై గడ్డి పెరగడంతో అసౌకర్యంగా ఉంది. కాలువలు శుభ్రం చేసి గడ్డిని తొలగించాలి. -మధుసూదన్, కొమ్మూరుకొట్టాల.
సమాధానం: కాలువలు శుభ్రం చేయిస్తాం. -కృష్ణమూర్తి, రంగాపురం.
సమస్య: నంద్యాల క్రాస్‌రోడ్డులో పెద్ద కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. -లక్ష్మణ్, బేతంచెర్ల
సమాధానం: శుభ్రం చేయిస్తాం. -సుజాత, శానిటరీ ఇన్‌స్పెక్టర్

డోన్: ప్రజా ఫిర్యాదులపై వినతులను ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి నేడు స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో స్వీకరిస్తారని తెదేపా నాయకులు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి జరిగే కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లక్ష్మంపల్లె(డోన్): గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ ముఖ్యమని ఏడీ నాగరాజు తెలిపారు. మండలంలోని లక్ష్మంపల్లె గ్రామంలో మూగజీవాలకు నట్టలనివారణ మందును వేయించారు. యు.కొత్తపల్లె పశువైద్యశాల అధికారి హుసేన్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

రాచర్ల(ప్యాపిలి): రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని కె.ఐశ్వర్య తెలంగాణలోని మాచిరాజు బాలసాహిత్య పీఠం వారు నిర్వహించిన కథల పోటీల్లో ప్రతిభ చూపిందని ప్రధానోపాధ్యాయిని ఉమాదేవి పేర్కొన్నారు. 'జలమా గరలమా' కథ బహుమతికి ఎంపికైందని తెలిపారు.

పెద్దకొప్పెర్ల: పెద్దకొప్పెర్ల, చిన్నకొప్పెర్ల దారిలో చింతచెట్టు వద్ద రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు రోడ్డుపైన ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

కాలనీల్లో అభివృద్ధి పరుగులిక!

■ 15వ ఆర్థిక సంఘం నిధులతో పనుల నిర్వహణకు చర్యలు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: డోన్ పురపాలక సంఘం పరిధిలోని వార్డుల్లోని చాలా వీధుల్లో సీసీ రహదారులు, మురుగుకాల్వలు, కల్వర్టులు, నీటి గొట్టాల పనులు ఇక చకచకా జరగనున్నాయి. పురపాలక పరిధిలోని వార్డుల్లో ప్రజల సౌకర్యార్థం మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కింద 2023-24 ఏడాదికి గానూ నిధులు మంజూరు చేసింది. డోన్ పురపాలక సంఘానికి 2023-24 సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం మొదటి విడత కింద నీటి సరఫరా, సాలిడ్‌వేస్ట్ మేనేజ్ మెంట్ అండ్ శానిటేషన్ కోసం నిధులు రూ.1,92,15,619లు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నారు. సీడీఎంఏ కార్యాలయ మార్గదర్శకాల ప్రకారంగా పురపాలక పరిధి వార్డుల్లోని వీధుల్లో ఏయే సౌకర్యాలు అవసరమో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు తయారు చేసి సీడీఎంఏ కార్యాలయానికి పంపిస్తారు. వాటిని కౌన్సిల్‌లో ఉంచి ఆమోదం పొందాక అధికారులు టెండర్లను పిలుస్తారు. టెండర్ల తర్వాత అధికారులు గుర్తించిన అభివృద్ధి పనులు చేపట్టేందుకు వీలు కలుగుతుంది.

ఎక్కడెక్కడ ఎలాంటివంటే..?

★ డోన్ పట్టణంలోని వైఎస్‌ఆర్ నగర్ నీటి గొట్టానికి నోచుకోలేదు. 60 కుటుంబాల వరకు ఉంటున్నాయి. మెయిన్ పైపులైన్ వేసి సబ్ పైపులైన్ వేయకుండా విస్మరించారు. దూరంగా ఉన్న నీటి పైపులైన్ నుంచి తక్కువ ఇంచీల గల నీటి గొట్టాలను వీధిలోని నిర్వాసితులు రూ.వేలకు రూ.వేలు ఖర్చు చేసి ఏర్పాటు చేసుకున్నా నీరు సరిగా రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి నీటి గొట్టం ఏర్పాటు చేస్తే కుళాయి కనెక్షన్లు తీసుకుని తాగునీటి సౌకర్యం పొందేందుకు అవకాశం ఉంటుందని అంతా భావిస్తున్నారు.


డోన్ వైఎస్‌ఆర్ నగర్‌లో నీటి గొట్టం ఏర్పాటుకు నోచుకోని వీధి

★ డోన్ పట్టణం శ్రీనివాసనగర్‌లో రహదారి అధ్వానంగా మారింది. గుంతలు ఉండటంతో వర్షం కురిస్తే చాలు..మోకాళ్ల లోతు మేర నీరు నిల్వ ఉంటోంది. ఆ దారిలో నిత్యం అధిక సంఖ్యలో జనం రాకపోకలు సాగిస్తుంటారు. అటు వైపు ఓ ప్రైవేట్ పాఠశాల ఉంది. పిల్లలు ఆదారి గుండా వెళ్లాల్సి వస్తుంది. ఈ దారిలో వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. సీసీ రహదారి ఏర్పాటు చేయాలని పాలకులకు, అధికారులకు తెలియజేసినా ఫలితం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడతారనే ఆశాభావంతో ఉన్నారు.

నీరు రాక అవస్థలు

-సుజాత, వైఎస్ఆర్ నగర్, డోన్



మా వీధిలో నీటి గొట్టం ఏర్పాటు చేయకపోవడంతో నీటి సమస్య నెలకొంది. దూరాన ఉన్న కుళాయిల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నాం. ఇంటి పన్నులు చెల్లిస్తున్నా నీటి గొట్టం లేక ఇబ్బందులుపడుతున్నాం. అధికారులు స్పందించి మా వీధిలో నీటి గొట్టంతో పాటు రోడ్లు, కాలువల నిర్మాణాలు చేపట్టాలి.

నిబంధనల మేర చేపడతాం

-ఎం.సురేష్, మున్సిపల్ ఏఈ, డోన్

2023-24 ఏడాదిలో 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏడీపీని తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తాం. తర్వాత ప్రతిపాదనలు రూపొందించి టెండర్లు పిలిచి నిబంధనల ప్రకారం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

అమరుల త్యాగం మరువలేనిది



నివాళులు అర్పిస్తున్న ఎస్సై

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పాతపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పద్మావతమ్మ అధ్యక్షతన అమరుల సంస్మరణ దినాన్ని నిర్వహించారు. సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. బాబు, వెంకటరమణ, సురేష్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని ప్యాపిలి ఎస్సై మధుసూదన్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో అమరుల సంస్మరణ దినాన్ని నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి సిబ్బందితో కలిసి బస్టాండు వరకు ర్యాలీ చేపట్టారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: వెలగటూరులో పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని ప్రకృతి పీఠం వ్యవస్థాపకుడు పల్లె నరసింహారెడ్డి సోమవారం నిర్వహించారు. రఘు, రాములమ్మ, మహేశ్వరరెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

సృజనకు పదును


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: విద్యార్థుల్లోని ప్రతిభను, నైపుణ్యాలను వెలికితీసేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పోటీలు ఎంతగానో దోహదపడతాయని ప్రిన్సిపల్ సిస్టర్ సిసిలీ, కరస్పాండెంట్ లిసి పేర్కొన్నారు. సోమవారం బేతంచెర్ల పట్టణంలోని సెంట్‌ఆన్స్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఇంటర్‌నెట్ వినియోగంతో కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం'పై వ్యాసరచన పోటీలు నిర్వహించగా, 8, 9, 10 తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలు ఎం.అపరంజిని, ఎస్.రబ్బాని, ఎస్.సఫియా బేగంలకు (పదో తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను, ప్రశంసాపత్రాలను ప్రిన్సిపల్, కరస్పాండెంట్‌తో పాటు ఉపాధ్యాయులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, యూనిస్, శ్రీదేవి, హసీనా తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్, కరస్పాండెంట్

ప్రతిభ చూపి... విజేతలుగా నిలిచి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థినీ, విద్యార్థుల్లో సృజనాత్మకత ఉంటోందని, వారి మెదడుకు పదును పెడితే మరింతగా ప్రతిభను వారు చాటుకోగలరని పాఠశాల ప్రిన్సిపల్ బి. ఫర్జానా పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కొత్తపేటలోని శ్రీ సుధ విద్యాలయంలో 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం'పై వ్యాసరచన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానంలో పి.లక్ష్మీ ప్రియ (9వ తరగతి), ద్వితీయ స్థానంలో కె. వైష్ణవి(9వ తరగతి), తృతీయ స్థానంలో ఎస్. షమియా(పదో తరగతి)నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ ప్రియాంక విజేతలకు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


ప్రశంసాపత్రాలు అందిస్తున్న ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్

పల్లె కబుర్లు

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: భూసర్వే జరిగిన గ్రామాల్లో ఈనెల 22 నుంచి రెవెన్యూ గ్రామ సభల్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

బనగానపల్లి గ్రామీణం: బనగానపల్లి మండల పరిధిలోని గ్రామాల్లో భూసమస్యల పరిష్కారానికి గ్రామసభలు మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు మండల తహసీల్దారు నారాయణరెడ్డి తెలిపారు.

సంజామల: భూసర్వే చేసిన గ్రామాల్లో గ్రామసభలు ఈనెల 22 నుంచి నవంబరు 2 వరకు జరుగుతాయని అనిల్‌కుమార్ చెప్పారు.

చాగలమర్రి: భూసర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు రవికుమార్ తెలిపారు. చాగలమర్రిలో ఈనెల 22న, చిన్నబోధనంలో 23న సభలు నిర్వహిస్తున్నామన్నారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: రీ-సర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలను విజయవంతం చేయాలని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. కోవెలకుంట్లలోని తహసీల్దారు కార్యాలయంలో వీర్వోలు, సర్వేయర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు.

దొర్నిపాడు: మండల వ్యాప్తంగా ఈనెల 22 నుంచి 26 వరకు గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుభద్ర సోమవారం పేర్కొన్నారు.

డోన్: మండలంలో రీసర్వే జరిగిన గ్రామాల్లో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు నాగమణి తెలిపారు. 22న కామగానికుంట్ల, 23న కొత్తబురుజు, 24న కొత్తకోట, 25న గుండాల, 26న వలసలల్లో సదస్సులు జరుగుతాయన్నారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: రీ-సర్వే జరిగిన రెవెన్యూ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భారతి సోమవారం తెలిపారు. 22న జక్కసానికుంట్ల, 23న మాధవరం, 24న నేరేడుచెర్లలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు.

బేతంచెర్ల,న్యూస్‌టుడే: రీసర్వేలో లోపాల సవరణకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రకాష్ బాబు సోమవారం తెలిపారు. ఈనెల 22 నుంచి 24 వరకు పెండేకల్లు, అంబాపురం, గొర్లగుట్ట గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయన్నారు.

అవుకు, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం నిర్వహించిన భూసర్వే సమ్యల పరిష్కారానికి నేటి నుంచి గ్రామాల వారీగా సమావేశాలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సువర్ణదేవి సోమవారం తెలిపారు.

మద్యం దుకాణాల తనిఖీ

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను సోమవారం నంద్యాల జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారి రవికుమార్ తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పట్టణంలో ఏర్పాటు చేసిన నాలుగు, గ్రామీణంలో రెండు మద్యం దుకాణాలను ఆయన పరిశీలించారు. గుడి, బడికి 100 మీటర్ల దూరాన దుకాణం ఉండాలని సూచించారు. ప్రస్తుతం వాటికి తాత్కాలిక లైసెన్సులు ఇచ్చామన్నారు. సీఐ వరలక్ష్మి, ఎస్సై సోమశేఖర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.


మద్యం దుకాణాలు పరిశీలిస్తున్న రవికుమార్

కాలువ కట్ట...వ్యర్థాల గుట్ట

యాగంటిపల్లె రోడ్డులోని ఎస్సార్బీసీ ప్రధాన కాలువ కట్టపై చెత్తచెదారం వేయడంతో పరిసరాల్లో దుర్వాసన ఎక్కువవుతోంది. కట్టపై వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు వాహనచోదకులు కోరుతున్నారు. 'న్యూస్‌టుడే' సంబంధిత ఈఈ సురేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. -న్యూస్‌టుడే, బనగానపల్లి



డీలర్ల సంఘం గౌరవాధ్యక్షుడి మృతికి సంతాపం


సంతాపం వ్యక్తం చేస్తున్న సభ్యులు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: డీలర్ల సమస్యల పరిష్కారానికి సుబ్బారాయుడు ఎంతగానో కృషి చేశారని, ఆయన మృతి తీరనిలోటని వక్తలు ప్రసంగించారు. సోమవారం ఆళ్లగడ్డ డీలర్ల సంఘం గౌరవాధ్యక్షుడు జక్కా సుబ్బరాయుడు మృతికి రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు సంతాపం తెలిపి మాట్లాడారు. ఈ సందర్భంగా డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య, కార్యదర్శి కలీముల్లా మాట్లాడుతూ ఏ చిన్న సమస్య వచ్చినా ఆయన వెంటనే స్పందించి అండగా ఉండేవారన్నారు. సహాయ కార్యదర్శి చాంద్‌బాషా, ప్రసాదు, కృష్ణమూర్తి, మజీద్ పాల్గొన్నారు.

బాలికల రక్షణకు ఎన్నో చట్టాలు

డోన్, న్యూస్‌టుడే: బాలికలు, మహిళల రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నాయని సీనియర్ సివిల్‌జడ్జి తంగమణి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాల వసతిగృహాన్ని ఆమె తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. సౌకర్యాలపై ఆరా తీశారు.భోజన వసతి ఎలా ఉందని అడిగారు. విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. వసతి గృహ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి తంగమణి

పరీక్షల నిర్వహణలో గందరగోళాన్ని నివారించాలి

బేతంచెర్ల,న్యూస్‌టుడే: పరీక్షల నిర్వహణలో గందరగోళాన్ని నివారించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆజాంబేగ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలోని సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మారినా అధికారుల ధోరణి మారలేదన్నారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటనాయక్, జిల్లా ఉపాధ్యాయ కన్వీనర్ చెన్నపరెడ్డి, జిల్లా కార్యదర్శి పుల్లయ్య పాల్గొన్నారు.

శిక్షణా నైపుణ్యాలతో ఉద్యోగావకాశాలు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులను శిక్షణ నైపుణ్యాల పెంపునకువివిధ కంపెనీలకు పంపిస్తున్నట్లు కళాశాలల జిల్లా కన్వీనరు ఎస్.ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. సోమవారం 22 మంది ఫిట్టర్ విద్యార్థులు రేణిగుంటలోని డిక్సాన్ కంపెనీకి వెళ్లారు. అక్కడ విద్యార్థులు మూడు నెలల శిక్షణ పొందుతారని, నెలకు రూ. 16,500ల స్టైఫండ్‌తో పాటు ఒక పూట ఉచిత భోజనం, రాత్రి భత్యం కింద రూ.150లు ఇస్తారన్నారు. ఏటీవోలు బద్దల శ్రీధర్, జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

మెప్మా ఉత్పత్తుల్ని ఆదరించండి: కమిషనర్

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మెప్మా ఉత్పత్తుల్ని ఆదరించాలని కమిషనర్ హరిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం శేషారెడ్డి ఉన్నత పాఠశాల సమీపంలో మెప్మా అర్బన్ మార్కెట్ ఆయన పరిశీలించి మాట్లాడారు. స్వయంసహాయక సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులను కొనుగోలు చేసి వారి అభివృద్ధికి తోడ్పాటును ఇవ్వాలని కోరారు. మెప్మా టీఎంసీ సూర్యనారాయణ, సీవో ఇద్రూస్ బాషా, డీఈవో సువర్ణ, ఆర్పీలు, స్వయంసహాయక సంఘ మహిళలు పాల్గొన్నారు.


మెప్మా ఉత్పత్తులు తనిఖీ చేస్తున్న హరిప్రసాద్


అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: రేవనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని గుండుపాపలలో ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారి డా.కాంతారావ్ నాయక్ పర్యటించారు. గ్రామంలోని అంగన్‌వాడీ, పాఠశాలలను తనిఖీ చేశారు. వంట పదార్థాలు,పరిశుభ్రతల ను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం , పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా. విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న నాయక్

అల్లర్లకు పాల్పడితే చర్యలు

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: అల్లర్లకు పాల్పడితే పోలీసులకు సమాచారమివ్వాలని ఎస్సై నరేంద్రకుమార్ తెలిపారు. సోమవారం సాయిశ్రీ మహిళా డిగ్రీ కళాశాలలో శక్తిటీం ఆధ్వర్యంలో మహిళలపై పెరుగుతున్న నేరాలు, సైబర్‌క్రైం వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

కారు టైరు పేలి...అయిదుగురికి గాయాలు

పేరాయిపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం),న్యూస్‌టుడే: మండలంలోని పేరాయిపల్లె మెట్ట వద్ద 40వ జాతీయ రహదారిపై సోమవారం కారు టైరు పేలి బోల్తా పడటంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గుంటూరుకు చెందిన అయిదుగురు గాయపడ్డారు. గుంటూరుకు చెందిన రమాదేవి, జాన్వీ, సాయి వెంకటేష్, సుధీర్, శశి మహానంది దర్శనం చేసుకుని అహోబిలానికి వస్తుండగా మార్గమధ్యలో పేరాయిపల్లె మెట్ట వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకొంది. క్షతగాత్రులు చికిత్సకు నంద్యాలకు వెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.

ప్రభుత్వ ధరలకే ఎరువులు విక్రయించాలి

మాయలూరు(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: ప్రభుత్వ ధరలకే ఎరువులను విక్రయించాలని మండల వ్యవసాయాధికారి సుధాకరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మాయలూరులోని లక్ష్మీనరసింహ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు.


ఎరువులను పరిశీలిస్తున్న సుధాకరరెడ్డి

వంక స్థలం పరిశీలన

డి.కొత్తపల్లె(చాగలమర్రి), న్యూస్‌టుడే: డి.కొత్తపల్లెలోని వంక స్థలాన్ని తహసీల్దారు రవికుమార్, ఎంఐ ఏఈ రాంప్రసాదు, సర్వేయర్ మద్దిలేటి, ఎస్సై రమేష్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. గ్రామంలోని వంక స్థలం ఆక్రమణకు గురైందన్న అంశంపై కొలతలు వేశామని తెలిపారు. గతంలో వంకలో కట్టలు వేయడం వల్ల పొంగి సమీప పొలాల్లో, ఎస్సీ కాలనీ వరకు నీరు ప్రవహించేదని, వంకను పూర్తిగా ఎంత మేర ఉందో హద్దులు ఏర్పాటు చేసి ఇరిగేషన్ అధికారులకు అప్పగిస్తున్నామని అధికారులు తెలిపారు.

వేలాడుతున్న ప్రమాదం



మండలంలోని రూపనగుడి ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో విద్యుత్తు తీగలు నేలకు వాలి ముళ్ల పొదల్లో ఉన్నాయి. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేసి తీగలను సరి చేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై సోమవారం ట్రాన్స్‌కో ఏఈ గురప్ప దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా... విద్యుత్తు స్తంభం ఏర్పాటుతో పాటు తీగలను సరిచేస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, రూపనగుడి(ఉయ్యాలవాడ)

మురుగు...పరుగు

పేరుసోములలో అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో కాలువల్లో పూడిక పేరుకుపోయింది. మురుగు రోడ్డెక్కి ప్రవహిస్తోంది. సోమవారం పంచాయతీ కార్యదర్శి విక్రంను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.
-న్యూస్‌టుడే, సంజామల



వైద్యులను కేటాయించారు..భవనం మరిచారు

◆ ముత్యాలపాడుకు పీహెచ్‌సీ కేటాయింపు ◆ పాత పంచాయతీ కార్యాలయంలోనే విధుల నిర్వహణ

ముత్యాలపాడు(చాగలమర్రి), న్యూస్‌టుడే: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో నూతన పీహెచ్‌సీని కేటాయించి దాదాపు ఏడాది దాటుతున్నా నేటికీ భవన నిర్మాణం జరగలేదు. గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గత వైకాపా హయాంలో ముత్యాలపాడుకు పీహెచ్‌సీని కేటాయించి వైద్యులను కేటాయించారు. అరకొరగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. ప్రజలకు వైద్య సేవలు అందించే ప్రధాన భవనం లేకుండా చేశారు. ప్రజలకు వైద్యసేవలందించేందుకు భవనం లేకపోవడంతో గ్రామంలోని పాత గ్రామ పంచాయతీని వైద్యులు ఆశ్రయించారు. పాత పంచాయతీ కార్యాలయంలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా ముత్యాలపాడులో ఆసుపత్రి నిర్మాణానికి నిధులు కేటాయించి ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందేలా చూడాలని అంతా కోరుతున్నారు.

కేవలం ఇద్దరు వైద్యులు, ఒక సూపర్‌వైజరే...

సాధారణంగా ఆసుపత్రిని ఏర్పాటు చేస్తే 14 మంది సిబ్బందిని కేటాయించాలి. వైకాపా ఆర్భాటంగా ఆసుపత్రిని కేటాయిస్తున్నట్లు చెప్పి కేవలం ఇద్దరు వైద్యులు, ఒక సూపర్‌వైజర్‌ను మాత్రమే నియమించింది. ఒక వైద్యుడు డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఉన్న ఒక్కరు కూడా ముత్యాలపాడు పరిధిలోకి వచ్చే ఎనిమిది సచివాలయాల్లో ఎఫ్‌డీపీలో (ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం) పాల్గొనేందుకే 20 రోజులు కేటాయిస్తున్నారు. ఉన్న 10రోజులు స్థానికంగా ఉండే పాత పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.


పాత పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆరోగ్య కేంద్రం శిథిలం...

ముత్యాలపాడులో ఆరోగ్య ఉప కేంద్రం ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. భవనం పెచ్చులూడుతోంది. ఆవరణ మొత్తం కంపచెట్లు, ముళ్ల పొదలు పెరగడంతో అక్కడ ఎవరూ వైద్య సిబ్బంది విధులు నిర్వహించడం లేదు.

పూర్తిగా సిబ్బందిని కేటాయించలేదు

-సుల్తానా, వైద్యురాలు, ముత్యాలపాడు

ముత్యాలపాడులోని పీహెచ్‌సీ పరిధిలో పని చేయాలని గతేడాది విధుల్లోకి తీసుకున్నారు. పీహెచ్‌సీకి ఉండాల్సిన సిబ్బంది మొత్తంగా లేరు. కేవలం ఇద్దరు వైద్యులు, ఒక సూపర్‌వైజర్ మాత్రమే ఉన్నారు. భవనం లేకపోవడంతో ప్రస్తుతం పంచాయతీ కార్యాలయ ఆవరణలో విధులు నిర్వహిస్తున్నారు. భవనం లేని విషయం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.